క్లుప్తంగా

దసరా శుభాకాంక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: చెడుపై మంచి చేసిన పోరాటంలో సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే విజయదశమి పండుగ సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆ దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ పూర్వ వైభవానికి కృషి



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ మాజీ చైర్మన్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించినందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న తనకు ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. మండలంలోని పరిటాల శివారు దొనబండ రాతి క్వారీ రోడ్డులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాయితీపై టమాట, వంట నూనె

నందిగామ టౌన్: రైతు బజార్‌లో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దసరా పండుగ సందర్భంగా టమాట, ఉల్లిపాయలు, పామోలిన్ ఆయిల్‌ను రాయితీపై అందిస్తున్నట్లు ఈఓ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమాట కిలో రూ. 42, ఉల్లిపాయలు రూ. 33, పామాయిల్ ప్యాకెట్ రూ. 115లకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృథాగా పోతున్న కృష్ణా వాటర్



జి.కొండూరు: మండల పరిధి గడ్డమణుగు గ్రామ శివారులో కృష్ణా వాటర్ పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. పైపులైను నుంచి లీకవుతున్న నీరు రహదారిపైకి రావడంతో రహదారి మొత్తం జలమయమై వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ పైపులైను జి. కొండూరు నుంచి గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు వరకు 18 కిలో మీటర్ల మేర ఉన్న ప్రధాన పైపులైను కావడంతో ఎగువన ఉన్న గ్రామాలకు కృష్ణా వాటర్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. అధికారులు వెంటనే స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేపడితే నీటి వృథాను అరికట్టడంతో పాటు ఎగువ గ్రామాలకు నీటి కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

మహిషాసురమర్దనీ పాహిమాం..



పెనుగంచిప్రోలులో శ్రీమహిషాసురమర్దనిగా అమ్మవారు



కంచికచర్ల శివసాయిక్షేత్రంలో మహిషాసురమర్దని అలంకారం



కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో అమ్మవారు



పేటలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీమహిషాసురమర్దని



శ్రీదుర్గామల్లేశ్వర ఆలయంలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

పెనుగంచిప్రోలు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం స్థానిక తూర్పు బజారులో శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ ఆలయం, శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, ముండ్లపాడులో నవరాత్రుల పందిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిషాసురమర్దని అలంకారంలో మహన్యాస పూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

జగ్గయ్యపేట అర్బన్: దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో అన్నదానం, సాయంత్రం రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. నకాశి బజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు కూచిపూడి నృత్యాలు అలరించగా, మాజీ ప్రభుత్వ విప్ ఉదయభాను పూజలు నిర్వహించి నృత్యాలు చేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి, అద్దాలబజారులో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆనందసాయి ఆలయం, తోటబజారులోని కనకదుర్గ మండపం, మార్కండేయ బజారులోని దుర్గాదేవి మండపంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వీరులపాడు: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా వెల్లంకి గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు మహిషాసురమర్దని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో ఉన్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లను మహిషాసురమర్దనిగా అలంకరించారు. గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పట్టణంలోని శుకశ్యామలాంబ, వాసవీ కన్యకాపరమేశ్వరి, మరిడీ మహాలక్ష్మి అమ్మవారితోపాటు మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు.

చందర్లపాడులో..

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు బతుకమ్మలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం చేశారు.

జగ్గయ్యపేటలో



గౌరవరంలో మహిషాసురమర్దని అలంకారంలో అమ్మవారు

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల, వేదాద్రి, గౌరవరం, తిరుమలగిరి, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని విశ్వబ్రాహ్మణ బజార్, పాత శివాలయం వీధిలోని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.



పేటలోని తోటబజారులో శ్రీమహిషాసురమర్దనిగా..



మహిషాసురమర్దని అలంకారంలో అల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారు



మహిషాసురమర్దనిగా శుకశ్యామలాంబ దేవి



మహిషాసురమర్దని అలంకారంలో అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



లింగాలపాడు లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారు..

ముగిసిన మద్యం దుకాణాల టెండర్లు

జగ్గయ్యపేట: ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగిసినట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల రెండు నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. సర్కిల్ పరిధిలో జగ్గయ్యపేట మండలంలో నాలుగు, మున్సిపాలిటీ పరిధిలో నాలుగు, వత్సవాయిలో రెండు దుకాణాలకు కలిపి మొత్తం 707 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో 88వ షాపునకు 47, 89వ షాపునకు 54, 90వ షాపునకు 56, 91వ షాపునకు 50, 92వ షాపునకు 57, 93వ షాపునకు 63, 94వ షాపునకు 61, 95వ షాపునకు 68, 96వ షాపునకు 131, 97వ షాపునకు 120 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూ. 14.14 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. వత్సవాయి మండలంలోని 96, 97 దుకాణాలకు అత్యధికంగా దరఖాస్తులు అందాయన్నారు. ఈనెల 14న విజయవాడలో కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ పద్ధతిలో షాపులను కేటాయించడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా వత్సవాయి మండలంలోని దుకాణాలకు తెలంగాణా ప్రాంతం నుంచి సిండికేట్‌ల ద్వారా దరఖాస్తులు రావడం విశేషం.

కంచికచర్ల, నందిగామ ఎక్సైజ్‌శాఖ పరిధిలో 1,220 దరఖాస్తులు

కంచికచర్ల: కంచికచర్ల ఎక్సైజ్ శాఖ పరిధిలో ఏడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయని ఆ శాఖ సీఐ అఫ్రపున్నీషా బేగం శుక్రవారం తెలిపారు. కంచికచర్ల మండలంలో ఐదు మద్యం దుకాణాలకు 203 దరఖాస్తులు రాగా వీరులపాడు మండలంలోని రెండు దుకాణాలకు 111 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. అదేవిధంగా నందిగామ ఎక్సైజ్‌శాఖ పరిధిలోని 906 దరఖాస్తులు వచ్చాయని ఆ శాఖ సీఐ బంగారురాజు పేర్కొన్నారు. నందిగామలోని ఎనిమిది షాపులకు 314, చందర్లపాడు మండలంలోని మూడు దుకాణాలకు 155, పెనుగంచిప్రోలు మండలంలోని ఐదు మద్యం దుకాణాలకు 437 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈనెల 14వ తేదీన విజయవాడలోని గురునానక్ కాలనీ ఎన్‌ఏసీ కల్యాణ మండలంలో లాటరీ తీయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

దసరా ఉత్సవాలకు పోలీస్ బందోబస్తు

వీరులపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్ఐ అనిల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పండుగలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండుగను జరుపుకోవాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు శిక్షణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఒకేషనల్ కో–ఆర్డినేటర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పాఠశాలలో ఒకేషనల్ విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన పాఠ్యాంశంలో భాగంగా ఒకేషనల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్‌పై ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. చదువుతోపాటు ఐటీ రంగాల్లో కూడా ప్రావీణ్యం పొందాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకేషనల్ కో–ఆర్డినేటర్ అయ్యప్పస్వామి, ఒకేషనల్ ట్రైనర్ ఎం. చెన్నారావు, బుజ్జి నెట్ సెంటర్, మీ సేవ, గ్రేస్ గ్రాఫిక్స్, శ్రీసాయితేజ డిజిటల్స్‌ను సందర్శించి విద్యార్థుల శిక్షణలను పర్యవేక్షించారు.

నందిగామలో రక్తదాన శిబిరాలు



నందిగామ టౌన్: దసరా పండుగ సందర్భంగా స్థానిక రజక బజార్‌లోని అనింద్య ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే స్థానిక క్లాత్ మర్చంట్ హాల్‌లో టీం పవన్ ఆర్మీ ఆధ్వర్యాన శుక్రవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ తంబళ్లపల్లి రమాదేవితో కలిసి మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు.

ఘనంగా మరియమాత జపమాల గ్రామోత్సవం



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): మండలంలోని బలుసుపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి మరియమాత జపమాల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. జగ్గయ్యపేట విచారణ గురువు ఫాదర్ జె. జయరాజు ఆధ్వర్యంలో అఖండ జపమాల మరియ మాత స్వరూపంతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జయరాజు మాట్లాడుతూ అక్టోబర్ మాసం అంటే మరియమాత జపమాల మాసం అని, ఈనెలలో మరియమాతను వేడుకుంటే అంతా శుభం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలి పూజ నిర్వహించారు. సిస్టర్లు సుశాంత, లిల్లీ, ఉపదేశి డి.అలోషియస్, సంఘ పెద్దలు ఉప్పుతోళ్ల బాలస్వామి, మేరీ వినీత, కొరివి బాబురావు, గండమాల సురేష్, పోలంపల్లి దావీదు, పలు గ్రామాల ఉపదేశకులు, సంఘస్తులు పాల్గొన్నారు.

కుంకుమపువ్వు సాగు పరిశీలన

బలుసుపాడు(జగ్గయ్యపేట): రైతులు కొత్త రకం పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. గ్రామంలోని నిమ్మగడ్డ రవీంద్రబాబు అనే రైతు చేపట్టిన కుంకుమపువ్వు సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కశ్మీర్‌లో సాగయ్యే కుంకుమపువ్వును ఈ ప్రాంతంలో సాగు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. రైతు మాట్లాడుతూ జూన్ నుంచి డిసెంబరు వరకు సాగు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

12 మంది బైండోవర్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): దాడి ఘటనలో 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని ముక్త్యాల గ్రామానికి చెందిన ధనమూర్తి, జాన్‌సైదులు పాతకక్షల నేపథ్యంలో దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు వర్గాల్లోని 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు



పెనుగంచిప్రోలు: బతుకమ్మ సంబరాలు శుక్రవారంతో ముగిశాయి. పెనుగంచిప్రోలు శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, అనిగండ్లపాడు శివాలయం వద్ద మహిళలు బతుకమ్మను రంగురంగుల పూలు, ఆకులతో చేసి గ్రామంలో ఆటపాటల మధ్య మునేరులో నిమజ్జనం చేశారు. అలాగే లింగగూడెం, ముండ్లపాడు, ముచ్చింతాల గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.